## చేబ్రోలు బ్రిడ్జికి తక్షణ మరమ్మతులు నూతన బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు మంత్రి పెమ్మసాని




**గుంటూరు , పెన్ పవర్,సెప్టెంబర్, 5,**
ప్రమాదంలో దెబ్బతిన్న చేబ్రోలు బ్రిడ్జిని కేంద్ర గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ శనివారం పరిశీలించారు. స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్‌తో కలిసి బ్రిడ్జి వద్ద పరిస్థితిని స్వయంగా పరిశీలించి అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు.ఇటీవల లారీ ప్రమాదంతో బ్రిడ్జి రైలింగ్ దెబ్బతినడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని మంత్రి పరిశీలించారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ బ్రిడ్జికి అవసరమైన మరమ్మతులను త్వరితగతిన పూర్తి చేయిస్తామని తెలిపారు.అదేవిధంగా, దీర్ఘకాలిక సమస్యకు శాశ్వత పరిష్కారంగా నూతన బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని పెమ్మసాని హామీ ఇచ్చారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

# పెన్ పవర్

## సెంట్రల్ ఆంధ్ర

ఎన్.టి.ఆర్ జిల్లా । కృష్ణా । గుంటూరు । పల్నాడు । బాపట్ల

## స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలి ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలకు కమిషనర్ మయూర్ అశోక్ ఆదేశం

**గుంటూరు, పెన్ పవర్,సెప్టెంబర్ 5:**
స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అధికారులు, సిబ్బంది పూర్తిస్థాయిలో సన్నద్ధంగా ఉండాలని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె. మయూర్ అశోక్ ఆదేశించారు. శనివారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఎన్నికల విధులు కేటాయించిన రిటర్నింగ్ అధికారులు (ఆర్‌ఓ), అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు (ఏఆర్‌ఓ)తో ఎన్నికల సన్నద్ధతపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తమవుతోందన్నారు. ప్రస్తుతం గుంటూరు నగరంలో 57 వార్డులు ఉండగా, డిలిమిటేషన్ ప్రక్రియలో భాగంగా 76 వార్డులుగా పునర్విభజన చేస్తున్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీలు, ప్రజల అభిప్రాయాలను సేకరించిన అనంతరం ఎన్నికల నిర్వహణ జరుగుతుందన్నారు.ప్రతి ఆర్‌ఓకు 3 నుంచి 4 వార్డుల వరకు కేటాయించే అవకాశం ఉందని, ఎన్నికల నిర్వహణలో ఆర్‌ఓల పాత్ర కీలకమని చెప్పారు. ఎన్నికల విధుల్లో ఎలాంటి పొరపాట్లు జరిగినా సంబంధిత ఆర్‌ఓదే పూర్తి బాధ్యత అని స్పష్టం చేశారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని సూచించారు.ఎలక్ట్రోరల్ రోల్స్, ఓటర్ల ప్రాతిపదికన రిజర్వేషన్ల కేటాయింపు, పోలింగ్ కేంద్రాల పరిశీలనతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండేలా ఓటర్ల జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఎన్నికల విధుల నిర్వహణకు నగరపాలక సంస్థ నుంచి అవసరమైన అన్ని సదుపాయాలు, సహకారం అందిస్తామని కమిషనర్ తెలిపారు.



సమావేశంలో ఇంచార్జ్ అదనపు కమిషనర్ సాంబశివరావు, డిప్యూటీ కమిషనర్లు బి. శ్రీనివాసరావు, సి. హెచ్. శ్రీనివాస్, సిటీ ప్లానర్ రాంబాబు, డీసీపీ సూరజ్ కుమార్, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది, ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

## విలువలతో కూడిన సమాజ నిర్మాణమే ధ్యేయం ఉపాధ్యాయులకు జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ పిలుపు




**గుంటూరు, పెన్ పవర్,సెప్టెంబర్ 5:**
డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని గుంటూరు కలెక్టర్ కార్యాలయంలోని ఎస్.ఆర్. శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన గురుపూజోత్సవ దినోత్సవం2026 కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని ఘనంగా సత్కరించారు. విద్యార్థులకు మార్కులతో పాటు విలువలు, నాయకత్వ లక్షణాలు, విశ్లేషణ సామర్థ్యం, ఒత్తిడిఓటములను తట్టుకునే ధైర్యాన్ని అందించాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులను సమాజానికి విలువైన సంపదగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు.డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ గొప్ప ఆచార్యుడిగా, తత్వవేత్తగా నిలవడానికి ఆయన పాటించిన విలువలు, ఆచరణే కారణమన్నారు. విద్యార్థులు సాధించిన విజయాన్ని గురువు తన విజయంగా భావించినప్పుడే గొప్ప ఫలితాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు.జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ భీమనేని వందనా దేవి, వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లెల ఈశ్వరరావు, జిల్లా విద్యాశాఖ అధికారి డా. షేక్ సలీం భాషా తదితరులు ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.ద

## ఉద్యోగులకు సీఎం చంద్రబాబు తీపి కబురు

**విజయవాడ , పెన్ పవర్,సెప్టెంబర్ 5:**
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీపి కబురు అందించారు. ఉద్యోగ సంఘాల నేతలతో జరిగిన సమావేశంలో పలు కీలక డిమాండ్లపై ప్రభుత్వం సానుకూల నిర్ణయాలు తీసుకుంది. ఎంతోకాలంగా ఉద్యోగులు ఎదురుచూస్తున్న 12వ వేతన సవరణ సంఘం (పీఆర్సీ) ఏర్పాటుకు సీఎం ఆమోదం తెలిపారు.అలాగే 2024 జూలై 1, 2025 జనవరి 1 తేదీలకు సంబంధించిన రెండు డీఏ బకాయిలను 2026 అక్టోబర్ 1 నుంచి చెల్లించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. 2022 సంవత్సరానికి సంబంధించిన సరెండర్ లీవుల మొత్తాన్ని వచ్చే సంక్రాంతి నాటికి ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయడానికి అంగీకరించింది.పోలీసు సిబ్బందికి అదనంగా




ఒక సరెండర్ లీవ్‌ను ఈ దసరా పండుగకు చెల్లించనున్నారు. అలాగే 2027 జనవరి నుంచి అదనపు పెన్షన్ క్వాంటం అమలు చేయాలని నిర్ణయించారు. 70 ఏళ్లు దాటిన వారికి 10 శాతం, 75 ఏళ్లు దాటిన వారికి 15 శాతం అదనపు పెన్షన్ లభించనుంది.ఉద్యోగుల ఆరోగ్య పథకం ను మరింత పటిష్ఠం చేయడంతో పాటు, వచ్చే నెల నుంచి ప్రతినెలా వైద్య బిల్లులను ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్‌కు ప్రభుత్వం నేరుగా చెల్లించేలా చర్యలు తీసుకోనుంది.ఉద్యోగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో ఉద్యోగుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఈ నిర్ణయాల వల్ల ప్రభుత్వంపై ఏటా సుమారు రూ.2,880 కోట్ల అదనపు భారం పడనున్నట్లు సమాచారం.

## గురు పూజోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులను సత్కరించిన ఎమ్మెల్యే నసీర్


గుంటూరు, పెన్ పవర్, సెప్టెంబర్, 5,

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆశయ సాధనలో పయనిస్తూ విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలకు విద్యను చేరువ చేస్తున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. శనివారం గురుపూజోత్సవం సందర్భంగా స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విజ్ఞాన వారధులని తెలిపారు. విద్యార్థుల జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దడంతో గురువుల పాత్ర కీలకమని చెప్పారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ ద్వారా పని చేస్తున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో మెగా డీఎస్సీ పేరిట దగా డీఎస్సీ నిర్వహిస్తే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 16 వేలకుపైగా పోస్టులతో డీఎస్సీ నిర్వహిస్తే దీనిపైనా అభాండాలు వేస్తున్నారని మండిపడ్డారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రతి పాఠశాలలో మౌలిక వసతులు కల్పిస్తూ ఉత్తమ విద్యా విధానాలు తీసుకురావడంతో మంచి ఫలితాలు వస్తున్నాయని తెలిపారు. తల్లికి వందనం, మధ్యాహ్న భోజన పథకం, విద్యార్థులకు ఉచితంగా విద్యా కిట్లు అందజేత వంటి కార్యక్రమాలతో విద్యార్థులకు తోడుగా నిలుస్తున్నారన్నారు. విద్యార్థులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. పుస్తకాల్లోని పాఠశాలతోపాటు జీవితాన్ని మార్చే గొప్ప మార్గదర్శకులు గురువులని తెలిపారు. దేశ భవిష్యత్తు తరగతి గది నాలుగు గోడల మధ్యే రూపుదిద్దుకుంటుందన్నారు. విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి, సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దే గురువులను ఎప్పుడూ మరిచిపోకూడదని చెప్పారు. గురువుల పట్ల గౌరవం, విధేయత కలిగి ఉండటమే మనం వారికి ఇచ్చే నిజమైన గురుదక్షిణ అన్నారు.

## రైతుల సమక్షంలోనే రీసర్వే నిర్వహించాలి రికార్డ్స్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్



**విజయవాడ , పెన్ పవర్,సెప్టెంబర్ 5:**
రైతులకు ముందస్తు సమాచారం అందించి, వారి సమక్షంలోనే రీసర్వే నిర్వహించాలని రాష్ట్ర సర్వే, సెటిల్మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ అధికారులను ఆదేశించారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి గ్రామంలో జరుగుతున్న రీసర్వేను ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.రీసర్వేలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఈ-కేవైసీ తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. సర్వే ప్రారంభం నుంచి భూ హద్దుల నిర్ధారణ, డాక్యుమెంట్ వెరిఫికేషన్ వరకు రైతుల సమక్షంలోనే ప్రక్రియ నిర్వహించాలని స్పష్టం చేశారు.రీసర్వే-2.0 ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించడమే లక్ష్యమని కూర్మనాథ్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఆధునిక రోవర్స్‌తో 2,800 బృందాల ద్వారా రీసర్వే కొనసాగుతోందన్నారు. ఫేజ్-5లో 1,343 గ్రామాల్లో రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తున్నట్లు వివరించారు. 2027 మార్చి నాటికి భూ వివాదాలు లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దేందుకు అధికారులు కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.

## గుంటూరులో పదో తరగతి బాలిక మిస్సింగ్ కేసు ఛేదించిన పోలీసులు

**గుంటూరు, పెన్ పవర్, సెప్టెంబర్, 5,**
పదో తరగతి బాలిక మిస్సింగ్ కేసును పోలీసులు ఎట్టకేలకు ఛేదించారు. జూన్ 10న పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో బాలిక అదృశ్యమైనట్లు కేసు నమోదైంది.
జాన్ సైదా అలియాస్ రబ్బానీ అనే వ్యక్తి బాలికను తీసుకెళ్లినట్లు దర్యాప్తులో గుర్తించారు. గుంటూరు, నెల్లూరు, తమిళనాడు, కేరళ, హైదరాబాద్ ప్రాంతాల్లో నిందితుడు వరుసగా ప్రదేశాలు మార్చడంతో అతడిని గుర్తించడం సవాల్‌గా మారిందని జిల్లా ఎస్పీ వకూల్ జిందాల్ తెలిపారు.
హైకోర్టులో బాలిక తండ్రి హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేయడంతో డీజీపీ ఆదేశాల మేరకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేశారు. ఐదు బృందాలుగా గాలింపు చేపట్టిన పోలీసులు చివరకు హర్యానాలోని కర్నాల్‌లో బాలికతో పాటు జాన్ సైదాను అదుపులోకి తీసుకున్నారు.
నిందితుడితో బాలికకు రెండేళ్లుగా పరిచయం ఉందని, పెళ్లి చేసుకుంటామని బాలిక తల్లిదండ్రులను నిందితుడు కోరినట్లు




ఎస్పీ తెలిపారు. ఈ విషయం నిందితుడి సోదరికి కూడా తెలుసని వెల్లడించారు.నిందితుడిపై పోక్సో, అత్యాచారం, కిడ్నాప్ తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. బాలిక మిస్సింగ్ కేసు దర్యాప్తులో పోలీసులు ఎలాంటి అలసత్వం చూపలేదని, కేసును నిరంతరం ఫాలోఅప్ చేశామని స్పష్టం చేశారు.ఇన్‌స్టాగ్రామ్ నుంచి వచ్చిన మిస్డ్ కాల్ ఆధారంగా ట్రేస్ చేయడంతో పాటు, ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్ల నుంచి డేటా సేకరణలో కొంత ఆలస్యం జరిగినా.. సిట్ బృందం నిరంతర ప్రయత్నాలతో నిందితుడిని పట్టుకుని బాలికను సురక్షితంగా తీసుకువచ్చిందని ఎస్పీ వకూల్ జిందాల్ తెలిపారు.

## కన్నసాని బాజీ నేతృత్వంలో కూటమి ప్యానెల్ నామినేషన్లు




**గుంటూరు, పెన్ పవర్,సెప్టెంబర్ 5:**
కొరిటెపాడు వాకింగ్ ట్రాక్ ఎన్నికల్లో కూటమి ప్యానెల్ అధ్యక్ష అభ్యర్థిగా కన్నసాని బాజీ, తన ప్యానెల్ సభ్యులతో కలిసి శనివారం నామినేషన్లు దాఖలు చేశారు. వాకర్లకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ వాకింగ్ ట్రాక్‌ను మరింత అభివృద్ధి చేయడమే తమ ప్రధాన లక్ష్యమని కన్నసాని బాజీ తెలిపారు.గత రెండేళ్లలో వాకర్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, పరిశుభ్రత, పచ్చదనం, తాగునీరు, విశ్రాంతి సౌకర్యాలు, జిమ్ పరికరాల నిర్వహణ, భద్రత వంటి అంశాలకు మరింత ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. పదవుల కోసం కాకుండా వాకర్లకు సేవ చేయాలనే ఉద్దేశంతోనే ఎన్నికల బరిలోకి దిగామని పేర్కొన్నారు.కూటమి ప్యానెల్ తరఫున వైస్ ప్రెసిడెంట్లుగా అనుముల రఘునాథ రెడ్డి, రాగం సదాశివరావు, సెక్రటరీగా అన్నం గంగాధర్, జాయింట్ సెక్రటరీగా నాగూర్ వలి, ట్రెజరర్‌గా పవన్ వెంకీ, జిమ్ బాధ్యతలకు యాంపరాల గోపి యాదవ్, ఈసీ సభ్యులుగా ఆనంద్, మరియదాస్, గణపతి, సాంబశివరావు నామినేషన్లు దాఖలు చేశారు.గత రెండేళ్లలో చేసిన అభివృద్ధిని గుర్తించి కూటమి ప్యానెల్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని కన్నసాని బాజీ వాకర్ సభ్యులను కోరారు. అనంతరం ప్యానెల్ సభ్యులు గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, జనసేన జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావులను మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు.చేసిన అభివృద్ధే మా ప్రచారం.. వాకర్ల సంక్షేమమే మా అజెండా.. కొరిటెపాడు వాకింగ్ ట్రాక్ సమగ్ర అభివృద్ధే మా లక్ష్యం" అని కూటమి ప్యానెల్ సభ్యులు పేర్కొన్నారు.



## 76 వార్డులుగా పునర్విభజన 57 నుంచి 76కు పెంపు..

### ప్రిలిమినరీ నోటిఫికేషన్ విడుదల



**గుంటూరు, పెన్ పవర్, సెప్టెంబర్, 5,**
గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో వార్డుల సంఖ్యను 57 నుంచి 76కు పెంచుతూ పునర్విభజన ప్రక్రియ చేపట్టారు. ఇందులో భాగంగా శనివారం ప్రిలిమినరీ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ తెలిపారు.ప్రభుత్వం జారీ చేసిన జీఓఎంఎస్ నెం.65 ప్రకారం 76 ప్రతిపాదిత వార్డుల ముసాయిదా సరిహద్దుల వివరాలను సెప్టెంబర్ 5 నుంచి ప్రజల పరిశీలనకు అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. జీఎంసీ ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయాలు, ముఖ్యమైన ప్రభుత్వ కార్యాలయాల నోటీసు బోర్డుల్లో వివరాలను ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు.ముసాయిదా వార్డుల సరిహద్దులపై ప్రజలకు ఏవైనా సూచనలు, అభ్యంతరాలు ఉంటే సెప్టెంబర్ 11లోపు జీఎంసీ ప్రధాన కార్యాలయంలోని పట్టణ ప్రణాళిక విభాగంలో సమర్పించాలని కమిషనర్ కోరారు.ప్రజల నుంచి అందిన సూచనలు, అభ్యంతరాలను సెప్టెంబర్ 12న సీడీఎంఏకు పంపుతామని, సెప్టెంబర్ 13న తుది వార్డులను ఖరారు చేసి, సెప్టెంబర్ 14న ఏపీ గెజిట్ ఫారం-6లో తుది నోటిఫికేషన్ ప్రచురిస్తారని కమిషనర్ తెలిపారు.

# పిల్లలకు పోషకాహారంపై అవగాహన



**పర్చూరు, సెప్టెంబర్ 5 (పెన్ పవర్) :**
జాతీయ పోషకాహార వారోత్సవాల సందర్భంగా శనివారం ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ స్థానిక అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్భంగా డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే పోషక విలువలతో కూడిన సమతుల్య ఆహారం తీసుకోవడం అలవాటు చేసుకోవాలన్నారు. మనం తీసుకునే ఆహారంలో మాంసకృత్తులు, పిండి పదార్థాలు, కొవ్వులు, విటమిన్లు, ఖనిజ లవణాలు సమపాళ్లలో ఉండాలని తెలిపారు.ప్రస్తుతం మారుతున్న జీవనశైలి కారణంగా చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు ఫాస్ట్‌ఫుడ్, జంక్‌ఫుడ్‌కు ఎక్కువగా అలవాటు పడుతున్నారని అన్నారు. దీనివల్ల అధిక బరువు, ఊబకాయం వంటి సమస్యలు వస్తున్నాయని తెలిపారు. పిల్లలు ప్యాకెట్ చిరుతిళ్లను తగ్గించి అంగన్వాడీ కేంద్రంలో అందించే కోడిగుడ్డు, పాలు వంటి పౌష్టికాహారాన్ని తప్పకుండా తీసుకోవాలని సూచించారు.తల్లిదండ్రులు కూడా పిల్లలను ఫోన్, చిరుతిళ్లకు దూరంగా ఉంచి పౌష్టికాహారం, వ్యాయామం వైపు ప్రోత్సహించాలని కోరారు.అనంతరం టీచర్స్ డే సందర్భంగా అంగన్వాడీ టీచర్లకు శుభాకాంక్షలు తెలిపి, చిన్నారుల భవిష్యత్తుకు వారు చేస్తున్న సేవలను అభినందించారు.కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ బాలశ్యామల, ఆయా, అంగన్వాడీ విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# కొత్తపేటలో వీధి కుక్కల స్వైరవిహారం!

రాత్రివేళ గుంపులుగా సంచారం.. భయాందోళనలో గ్రామస్తులు
చిన్నారులు, వృద్ధులు బయటకు రావాలంటేనే జంకుతున్న వైనం
వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజల విజ్ఞప్తి





**చీరాల, సెప్టెంబర్ 5,(పెన్ పవర్) :**
వేటపాలెం మండలంలోని కొత్తపేట గ్రామపంచాయతీ పరిధిలో వీధి కుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతోందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో వీధి కుక్కలు గుంపులుగా సంచరిస్తూ రోడ్లపై స్వైరవిహారం చేస్తుండటంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.
సాయంత్రం చీకటి పడిన తర్వాత పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతోందని స్థానికులు చెబుతున్నారు. ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారిని కుక్కలు వెంటపడటం, గుంపులుగా మొరిగుతూ భయపెట్టడం వంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయని పేర్కొంటున్నారు. దీంతో రాత్రి సమయంలో అత్యవసర పనులపై బయటకు వెళ్లాల్సిన వారు సైతం ఆందోళనతో రాకపోకలు సాగించాల్సి వస్తోందని వాపోతున్నారు.

<u>చిన్నారులు, వృద్ధులే టార్గెట్?</u>

గ్రామంలోని వీధుల్లో చిన్నారులు, వృద్ధులు, మహిళలు నడుచుకుంటూ వెళ్లే సమయంలో వీధి కుక్కలు వెంటపడుతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో పిల్లలను ఒంటరిగా బయటకు పంపేందుకు తల్లిదండ్రులు భయపడుతున్నారని స్థానికులు చెబుతున్నారు.
వీధుల్లో విచ్చలవిడిగా పడేస్తున్న ఆహార వ్యర్థాలు, మాంసాహార వ్యర్థాలు కూడా కుక్కల గుంపులు ఒకచోట చేరడానికి కారణమవుతున్నాయని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. చెత్తను నిర్ణీత ప్రాంతాల్లోనే వేయడంతో పాటు వీధుల్లో పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరచాల్సిన అవసరం ఉందని వారు కోరుతున్నారు.

<u>ప్రమాదాలు జరిగేలోపే మేల్కొనాలి</u>

వీధి కుక్కల బెడదపై అధికారులు స్పందించకపోతే భవిష్యత్తులో కుక్కకాటు ఘటనలు చోటుచేసుకునే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో వీధి కుక్కల కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో కొత్తపేటలోనూ సమస్య తీవ్ర రూపం దాల్చకముందే అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.
కుక్కల సంఖ్యను నియంత్రించేందుకు నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు చేపట్టడంతో పాటు, వాటికి యాంటీ-రేబిస్ వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ వంటి కార్యక్రమాలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. అదే సమయంలో గ్రామంలో చెత్త నిర్వహణను పటిష్టం చేసి కుక్కలు గుంపులుగా చేరే పరిస్థితిని నివారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

<u>పంచాయతీ అధికారులు స్పందించాలి</u>

కొత్తపేట గ్రామపంచాయతీ పరిధిలో వీధి కుక్కల సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి, సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించాలని గ్రామస్తులు కోరుతున్నారు. రాత్రివేళల్లో ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రజలకు ఇబ్బంది కలిగించే పరిస్థితి ఏర్పడే వరకు వేచి చూడకుండా గ్రామపంచాయతీ అధికారులు, సంబంధిత సిబ్బంది వెంటనే స్పందించి వీధి కుక్కల బెడదకు శాశ్వత పరిష్కారం చూపాలని కొత్తపేట గ్రామస్తులు కోరుతున్నారు.

# సందెపూడిలో ఉచిత దంత వైద్య శిబిరం



చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, సెప్టెంబర్ 05 :
ఎడ్లపాడు మండల పరిధిలోని సందెపూడి గ్రామంలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కీ.శే.ఇడపలపాటి సరస్వతి జ్ఞాపకార్థం ఆమె భర్త, రిటైర్డ్ హెచ్ఎం ఇడపలపాటి చంద్రయ్య ఆధ్వర్యంలో సిబార్ డెంటల్ కాలేజీ అండ్ హాస్పిటల్ సహకారంతో శనివారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు.డాక్టర్ రాజశేఖర్ నేతృత్వంలో ఐదుగురు వైద్యులు, పది మంది సిబ్బందితో కూడిన బృందం 150 మందికి దంత పరీక్షలు నిర్వహించింది. ఈ సందర్భంగా 40 మందిని మెరుగైన వైద్యం కోసం సిబార్ డెంటల్ హాస్పిటల్‌కు రిఫర్ చేయగా, 16 మందికి దంతాలను తొలగించారు. అలాగే అవసరమైన మందులు, టూత్ పేస్టులను ఉచితంగా అందించారు. అనంతరం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులను సన్మానించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ ఫార్మసీ ఆఫీసర్ కె. శ్రీనివాసరావు, గ్రామీణ వైద్యులు కే.వీ. హనుమంతరావు, గ్రామ పెద్దలు సుబ్బారావు, నగరాజకుమారి, చెంచురామయ్య, రామయ్య, భూషయ్య, సాంబయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# సాగర్ జలాలతో మూడువాగుల పరిధిలోని 12 గ్రామాలకు సురక్షిత మంచినీరు : ప్రత్తిపాటి

**- ప్రజలకు నీటి ఇబ్బందులు లేకుండా ప్రణాళికబద్ధంగా వ్యవహరించండి.**
**- సాగర్ జలాల్ని కుప్పగంజి, ఓగేరు, నక్కవాగుల ద్వారా మంచినీటి చెరువులకు మళ్లించండి**
**- మూడు వాగుల పరిధిలోని మంచినీటి అవసరాల నీటి విడుదలకు నాగార్జున సాగర్ ఎస్.ఈ, సీఈ లు అంగీకరించారు**



**చిలకలూరిపేట , పెన్ పవర్, సెప్టెంబర్ 05 :**
నియోజకవర్గ ప్రజల తాగునీటి అవసరాల దృష్ట్యా భవిష్యత్ లో ఇబ్బందులు తలెత్తకుండా మంచినీటి చెరువుల్నినీటితో నింపాలని నిర్ణయించుకున్నామని, ఆ దిశగా నాగార్జున సాగర్ నుంచి నీటిని విడుదల చేయాలని సంబంధిత అధికారుల్ని కోరినట్టు శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. ఇప్పటికే విడుదల చేసిన నీటికి అదనంగా నియోజకవర్గంలోని మూడు ప్రధాన వాగులకు కూడా నీరందించడానికి సంబంధిత అధికారులు సుముఖత వ్యక్తం చేశారని ఆయన తెలియచేశారు. ఎల్ నినో దృష్ట్యా సమర్థ నీటి నిర్వహణ చర్యలు చేపట్టాలని, నీటిసరఫరా నష్టాలు, వృథా లేకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. శనివారం ఆయన తన నివాసంలో నియోజకవర్గ మంచినీటి సమస్య, ప్రజల ఇబ్బందులపై మున్సిపల్, ఆర్.డబ్ల్యూఎస్ అధికారులు, మండల నాయకులతో చర్చించారు.
సాగర్ నీటిని మూడు వాగుల పరిధిలోని చెరువులకు మళ్లించి, తాగునీటి అవసరాలకు వినియోగించండి.
ప్రస్తుతం సాగర్ జలాశయం నుంచి మంచినీటి అవసరాల కోసం కాలువల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారని, ఆ క్రమంలో ప్రజల తాగునీటి అవసరాల నిమిత్తం మూడు ప్రధాన వాగులకు, వాటి పరిధిలోని తాగునీటి చెరువుకు అదనపు నీటి విడుదల కోసం నాగార్జున సాగర్ అధికారులతో మాట్లాడినట్టు ప్రత్తిపాటి పేర్కొన్నారు. తాగునీటి అవసరాలు, ప్రజల ఇబ్బందులపై ఫోన్ ద్వారా నాగార్జున సాగర్ ఎస్ఈ, సీఈ రమేశ్ తో చర్చించగా, వారు సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే చెప్పారు. ఒకట్రెండు రోజుల్లో నియోజకవర్గ తాగునీటి అవసరాలకు సరిపడా నీటిని సరఫరా చేస్తామని హామీ ఇచ్చారన్నారు. సాగర్ నీరు ఎక్కడా వృథా కాకుండా కుప్పగంజి, ఓగేరు, నక్కవాగులకు సరపరా అయ్యేలా చూడాలని, మంచినీటి చెరువుల్ని నింపి, ప్రజలకు ఎలాంటి నీటి ఇబ్బందులు లేకుండా సకాలంలో నీరందేలా చర్యలు తీసుకోవాలని ప్రత్తిపాటి అధికారుల్ని ఆదేశించారు. సాగర్ జలాల విడుదలతో మూడువాగుల పరిధిలోని వేలూరు, కుక్కపల్లివారిపాలెం, లింగంగుంట్ల, గోపాలంవారిపాలెం, బొప్పూడి, పసుమర్రు, మురికిపూడి, దండమూడి, నాగభైరువారి పాలెం, మిట్టపాలెం, ఈవూరివారిపాలెం, తుర్లపాడు గ్రామ ప్రజలకు సురక్షితమైన మంచినీరు అందుతుందని ప్రత్తిపాటి పేర్కొన్నారు. తాగునీటి అవసరాల నిమిత్తం విడుదలైన నీటిని సాగు అవసరాలకు మళ్లించకుండా చూడాలని ఎమ్మెల్యే మండల నాయకులకు సూచించారు. ఎల్ నినో తీవ్రత దృష్ట్యా ప్రభుత్వం తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టిందన్నారు.

# పదవీ విరమణ చేసిన సిబ్బందికి ఘన సన్మానం

**చీరాల, సెప్టెంబర్ 5 (పెన్ పవర్):**
ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని బండ్ల బాపయ్య విద్యా సంస్థల్లో సుదీర్ఘకాలం సేవలందించి పదవీ విరమణ చేసిన సిబ్బందిని మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. విద్యా సంస్థల అభివృద్ధికి, విద్యార్థుల భవిష్యత్తుకు తమ సేవలను అందించిన విశ్రాంత ఉద్యోగులను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించి వారి సేవలను కొనియాడారు.కళాశాలలో సుదీర్ఘకాలం సేవలందించి పదవీ విరమణ చేసిన కుమారి కె.నాగమాంబ, కె. రంగ నాయకులు, ఎస్.గురు మూర్తి, పి.బాల సుబ్రహ్మణ్యం, ఎం.గంగాధర రావు, బి.సుబ్రహ్మణ్యం ను ఘనంగా సన్మానించారు. అదేవిధంగా హైస్కూల్‌లో సేవలందించి పదవీ విరమణ చేసిన ఎన్. యేసుదాసు,బి. బద్రయ్య, పి.రామలింగం, చి. బాల సుబ్రహ్మణ్యం, బి. భూషణం ను కూడా ఘనంగా సత్కరించారు.
ఈ సందర్భంగా సుదీర్ఘకాలం విద్యా సంస్థలకు సేవలందించిన వారి అనుభవం, అంకితభావం విద్యార్థులకు, సిబ్బందికి ఆదర్శప్రాయమని నిర్వాహకులు పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సేవలను గుర్తు చేసుకుంటూ, విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో వారి పాత్ర ఎంతో కీలకమని కొనియాడారు.కార్యక్రమంలో సెక్రటరీ, కరెస్పాండెంట్ చల్లా వాసుదేవరావు, జాయింట్ సెక్రటరీ బండ్ల రవీంద్రనాథ్, నిరతాన్నదాత, మాజీ వైస్ ప్రెసిడెంట్, బండ్ల బాపయ్య విద్యా సంస్థల కమిటీ సభ్యులు ఆర్‌టీఎన్ గొల్లపూడి సీతారాం, కళాశాల ప్రిన్సిపల్ బి. బాపయ్య శెట్టి, కళాశాల, హైస్కూల్ సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



# ఉపాధ్యాయులే సమాజానికి రోల్ మోడల్స్

## నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు





**నరసరావుపేట, పెన్ పవర్ సెప్టెంబర్ 05:**
విద్యార్థులకు విద్యాబోధనతో పాటు విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతను పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ాపల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం నరసరావుపేట భువనచంద్ర టౌన్‌హాల్‌లో నిర్వహించిన పల్నాడు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల ప్రదానోత్సవంలో వారు మాట్లాడారు. నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ విద్యార్థుల్లో విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతపక్ ఉపాధ్యాయులు రోల్ మోడల్స్‌గా నిలవాలీలని అన్నారు. ఉపాధ్యాయుల నడవడికను విద్యార్థులు, సమాజం గమనిస్తుంటారని పేర్కొన్నారు. ఉపాధ్యాయ వృత్తిని కేవలం ఉద్యోగంగా కాకుండా సామాజిక బాధ్యతగా భావించాలని చెప్పారు.విద్యారంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ విద్యార్థి విద్యకు దూరం కాకుండా అవసరమైన సహకారం అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులు, పోషకాహారం తదితర సదుపాయాలపై అధికారులు, ప్రజాప్రతినిధులు నిరంతరం పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉందన్నారు.పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాలల అభివృద్ధికి స్వచ్ఛందంగా సహకరిస్తున్నారని, సైకిల్ స్టాండ్లు, సైకిళ్లు, కంప్యూటర్లు తదితర సదుపాయాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. పాఠశాలల అభివృద్ధిలో ఇటువంటి భాగస్వామ్యం మరింత పెరగాలని ఆకాంక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తన జీవితంలో తాను సాధించిన విజయాల వెనుక ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, జ్ఞానం, క్రమశిక్షణ కీలకంగా నిలిచాయని తెలిపారు. ఖురాజ, ూూ సాధించడంలో తనకు చిన్ననాటి నుంచి ఉపాధ్యాయులు అందించిన మార్గనిర్దేశం, సమయం, జ్ఞానాన్ని ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నానన్నారు.ప్రస్తుత కాలంలో బోధనా వృత్తి గతంలో కంటే మరింత సవాళ్లతో కూడుకున్నదని కలెక్టర్ అన్నారు. నేటి తరం విద్యార్థులకు డిజిటల్ పరికరాలు, ఇంటర్నెట్, సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత సమాచారానికి ప్రాప్యత ఉందని, అందువల్ల ఉపాధ్యాయులు కూడా తమ జ్ఞానాన్ని నిరంతరం నవీకరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతికతను బోధనలో సమర్థంగా వినియోగిస్తూ విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా దయాగ్రామ్‌లు, కార్యకలాపాలు, నమూనాలు తదితర పద్ధతులను ఉపయోగించాలని సూచించారు.విద్యార్థుల చదువుతో పాటు వారి వ్యక్తిత్వ వికాసం, విలువలు, నైతికత, బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దడంపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. ప్రతి రోజు తరగతి సమయంలో కొంత సమయాన్ని విలువల విద్య, వ్యక్తిత్వ వికాసానికి కేటాయించాలని కోరారు. విద్యార్థుల్లో ప్రవర్తనా మార్పులు గమనించినప్పుడు వారిని ప్రత్యేకంగా పిలిచి మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకునే ప్రయత్నం చేయాలని చెప్పారు. నేటి విద్యార్థులపై సామాజిక మాధ్యమాలు, డిజిటల్ ప్రపంచం ప్రభావం ఎక్కువగా ఉందని, దీనివల్ల చదువుపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. విద్యార్థుల్లో ఒత్తిడి, మానసిక ఆందోళనలు వంటి సమస్యలను గుర్తించి వారికి అవసరమైన మార్గదర్శకత్వం అందించడంలో ఉపాధ్యాయులు కీలకంగా వ్యవహరించాలన్నారు.70 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలువిద్యారంగంలో విశిష్ట సేవలు అందించిన 70 మంది ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులకు పల్నాడు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లు తదితర విభాగాలకు చెందిన ప్రతిభావంతులను అవార్డులకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, పల్నాడు జిల్లా సమగ్ర శిక్ష అదనపు కోఆర్డినేటర్ శ్యామ్ ప్రసాద్, గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టీనా, జిల్లా విద్యాశాఖాధికారి రామారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

# శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణే లక్ష్యంగా వరవకట్టలో కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

**నరసరావుపేట, పెన్ పవర్ సెప్టెంబర్ 05:**
పల్నాడు జిల్లా అదనపు ఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి ఐపీఎస్ ఆదేశాల మేరకు నరసరావుపేట ఉపవిభాగ పరిధిలోని నరసరావుపేట మొదటి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధి వరవకట్ట ప్రాంతంలో శనివారం ఉదయం కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. నరసరావుపేట డీఎస్పీ ఎం. హనుమంతరావు పర్యవేక్షణలో చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా శాంతి భద్రతల పరిరక్షణ, చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిర్మూలన, నేర నియంత్రణతో పాటు ప్రజల్లో భద్రతా భావన పెంపొందించడంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బందిని ప్రత్యేక బృందాలుగా విభజించి రౌడీ షీటర్లు, ట్రబుల్ మాంగర్లు, పాత కేసుల నిందితుల కదలికలపై నిఘా పెట్టారు. ఇళ్లు, పరిసర ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించి అనుమానాస్పద వ్యక్తులు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై సమాచారాన్ని సేకరించారు. తనిఖీల్లో సరైన పత్రాలు లేని 23 ద్విచక్ర వాహనాలు, మూడు ఆటోరిక్షాలను స్వాధీనం చేసుకున్నారు.
ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించిన అధికారులు వరవకట్ట ప్రాంత ప్రజలతో సమావేశమై రహదారి భద్రత, హెల్మెట్ వినియోగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాలు, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల జరిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ప్రాంతంలో అపరిచిత వ్యక్తులు సంచరిస్తున్నట్లు గమనిస్తే వెంటనే 112కు సమాచారం ఇవ్వాలని సూచించారు. రాబోయే స్థానిక ఎన్నికల దృష్ట్యా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగానే ఈ కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. అలాగే రౌడీ షీటర్లు, ట్రబుల్ మాంగర్లు, పాత కేసుల నిందితులపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని వెల్లడించారు.
పాత కేసుల నిందితులతో సమావేశమైన పోలీసులు గతపు నేరపూరిత కార్యకలాపాలను విడిచిపెట్టి సత్ప్రవర్తనతో జీవించాలని సూచించారు. ప్రాంతంలో అకారణ గొడవలు సృష్టించినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు తమ ప్రాంతాల్లో ఎదురయ్యే సమస్యలను వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఎం. హనుమంతరావు, మొదటి పట్టణ సీఐ ఫిరోజ్, రెండో





పట్టణ సీఐ ప్రభాకర్, రూరల్ సీఐ సుబ్బారావు, చిలకలూరిపేట పట్టణ సీఐ రమేష్, వినుకొండ రూరల్ సీఐ బ్రహ్మయ్య, ఉపవిభాగ పరిధిలోని ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

